సాక్షి మంచిర్యాల

శనివారం : 8 : ఫిబ్రవరి : 2025



కబడ్డీ చాంపియన్ సూర్యపేట

అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యపేట జట్టు విజేతగా నిలిచింది. నల్గొండ రెండో స్థానంలో నిలువగా.. వనపర్తి, రంగారెడ్డి జట్లు మూడోస్థానంలో నిలిచాయి. 8లో▸



మిగిలింది.. సోమవారమే

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు శుక్రవారం ఒక్కరోజే 30 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బట్టిగూడెం కాలనీలో డీఎంహెచ్‌వో

చెన్నూర్‌రూరల్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. చెన్నూర్‌లోని పలు కాలనీల్లో డయేరియా వ్యాపిస్తున్నందున శుక్రవారం ఆయన పర్యటించారు. చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించి మున్సిపల్ అధికారులు, వైద్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా మూడు రకాలుగా ఉంటుందని, ఇది మొదటి రకమని, జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని అన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే కాలనీ, బట్టిగూడెం, లైన్‌గడ్డ, జెండావాడలో కేసులు నమోదయ్యాయని, బతుకమ్మ వాగు నీటిని వరంగల్ ల్యాబ్‌లో పరీక్షకు పంపించామని తెలిపారు. ఇప్పటి వరకు 67 కేసులు నమోదు కాగా అందులో 50 మంది రోగులు పూర్తిగా కోలుకుని ఇంటికి వెళ్లారని వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, పీఓ డాక్టర్ ప్రసాద్, సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు రవితేజ, హెచ్‌ఈవోలు జగదీశ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని రెవెన్యూ శాఖలో పలువురు సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయ గిర్దావర్ వి.ఆదిలక్ష్మిని కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఈ.పద్మశ్రీని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి, చెన్నూరు తహసీల్దార్ కార్యాలయ గిర్దావర్ రంజిత్‌కుమార్‌ను హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంటుగా, మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయ గిర్దావర్ మహ్మద్ అబ్దుల్ అజీజ్‌ను చెన్నూరు తహసీల్దార్ కార్యాలయ గిర్దావర్‌గా బదిలీ చేశారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పడేలా చూడాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

మంచిర్యాలటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీకి పడేలా చూడాలని ఆ పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీశ్‌జైన్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల మొదటి ప్రాధాన్యత ఓటు పడేలా కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజి, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి చల్ల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, సీనియర్ నాయకులు గోనె శ్యాంసుందర్‌రావు, మున్నారాజా సిసోడియా, ఆరుముల్ల పోశం, డాక్టర్ రఘునందన్, తుల ఆంజనేయులు పాల్గొన్నారు.

జనరల్ అసిస్టెంట్‌గా జనరల్ మజ్దూర్



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో జనరల్ మజ్దూర్‌లు ఇక నుంచి జనరల్ అసిస్టెంట్‌గా డిజిగ్నేషన్ మారబోతుందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఆయన యూనియన్ కార్యకర్తలతో మాట్లాడారు. చాలా ఏళ్లుగా జనరల్ మజ్దూర్‌లు తమ డిజిగ్నేషన్ పేరు మార్చి గౌరవప్రదమైన డిజిగ్నేషన్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. తమ యూనియన్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టీబోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన సమావేశంలో కోలిండియా యజమాన్యంతో కొట్లాడి ఒప్పించారని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు గూడ శ్రీకాంత్, జిల్లా తిరుపతి, కుంట రాజు, కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దొంగలున్నారు జాగ్రత్త!



భీమారంలో జరిగిన చోరీపై గురువారం వివరాలు తెలుసుకుంటున్న సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేత



- రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలు
- కూడబెట్టిన సొమ్ము దొంగలపాలు
- జిల్లాలో బరితెగిస్తున్న చోరులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



భీమారంలో లాకర్‌ని పగులగొట్టిన దుండగులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన సొమ్మును దొంగలు క్షణాల్లో దోచుకెళ్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా చేసుకుని సొమ్ము ఎత్తుకెళ్లడంతోపాటు బజారులో ఎవరైనా చేతిలో నగదుతో కనిపిస్తే మాయం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల పట్టపగలే జరుగుతున్న చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో అప్పుడప్పుడు మాత్రమే చోరీలు వెలుగులోకి వచ్చేవి. ఇటీవల గ్రామాలు, పట్టణాలు, సింగరేణి కాలనీల్లో పగలు, రాత్రి తేడా లేకుండా దొంగతనాలు జరుగుతున్నాయి. నిత్యం పోలీసు గస్తీ, సీసీ కెమెరాలు, భద్రత ఉన్నప్పటికీ దొంగలకు భయం లేకుండా పోతోంది. ఎలాంటి జంకు లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. బాధితుల నుంచి నగదు, బంగారంతోపాటు విలువైన సొత్తును ఎత్తుకెళ్తున్నారు. ఇవే గాకుండా సింగరేణి, ఇతర పరిశ్రమల్లో నుంచి పాత ఇనుప సామగ్రి చోరీకి గురవుతున్నాయి. కోల్పోయిన సొమ్ము కొన్ని సార్లు రికవరీ కావడం లేదు. దీంతో బాధితుల కష్టార్జితం దొంగలపాలవుతోంది.

ఆదమరిస్తే అంతే..

ప్రస్తుతం శుభకార్యాలు అధికంగా ఉండడంతో నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. బ్యాంకులు, ఏటీఎంలు తదితర ప్రాంతాల నుంచి డబ్బుతో వెళ్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్లు, ఇతర ప్రాంతాల్లోకి వెళ్లినప్పుడు చుట్టుపక్కల పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు. సొమ్ము వెంట ఉన్నప్పుడు అశ్రద్ధగా ఉండొద్దని పేర్కొంటున్నారు. ఇక బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో విలువ పెరుగుతోంది. ఈ క్రమంలో మహిళల ఒంటిపై ఉన్న ఆభరణాలపైనా అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, దుకాణాలకు యాంటితెఫ్ట్ అలారం క్లాక్ వాడాలని సూచిస్తున్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్తే విలువైనవి ఉంచొద్దని చెబుతున్నారు. పోలీసు వారికి ముందస్తు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో గస్తీ పెంచుతారు.

గత రెండేళ్లలో జరిగిన దొంగతనాలు



	2023	2024
సాధారణ దొంగతనాలు	161	228
పట్టపగలు ఇళ్లలో చోరీలు	24	19
రాత్రి వేళ ఇళ్లలో చోరీలు	96	101
కోల్పోయిన సొత్తు	రూ.2,32,54,657	రూ.2,76,10,514
స్వాధీనం చేసుకుంది	రూ.5,41,4310	రూ.13,34,5927
రికవరీ శాతం	23 శాతం	48 శాతం

బరితెగిస్తున్న దొంగలు

- బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం పట్టపగలే రూ.4.40లక్షలు దొంగలు ఎత్తుకెళ్లారు. మార్కెట్ ఏరియాలో బాధితుడి బైక్‌లో డబ్బు పెట్టి పార్కింగ్ చేయగా, దొంగలు అదును చూసి దొంగిలించారు.
- రెండు రోజుల క్రితం భీమారం మండలం కేంద్రం ఐటీడీఏ కాలనీలో ఓ ఇంటికి తాళం వేసి ఉండగా పగులగొట్టి రూ.50వేలు, రూ.42వేల విలువైన బంగారం ఎత్తుకెళ్లారు.
- గత నెలలో బెల్లంపల్లి మండలం కన్నాల హైవేపై ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో దొంగలు అమ్మవారి వెండి, బంగారం అపహరించారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు



జిల్లాలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఇటీవల జరిగిన చాలా కేసుల్లో నిందితులను పట్టుకున్నాం. ఎవరైనా నగదు, బంగారం, విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లేటప్పుడు అశ్రద్ధగా ఉండొద్దు. అలాగే ఇంటికి తాళం వేసి వెళ్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా ఉంచుతాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఎకో పార్క్ పనులు షురూ



పార్క్ స్థలంలో మట్టి పనులు

శ్రీరాంపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి మరో ముందడుగు వేసింది. ఇన్నాళ్లు కాలనీల్లో అనేక పార్కులు ఏర్పాటు చేసిన కంపెనీ నేడు ప్రకృతికి దగ్గరగా ఉండే ఎకో పార్క్‌లకు శ్రీకారం చుట్టింది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు దారిలో ఎకో పార్క్ పనులు చేపట్టారు. గత ఏడాది ఫిబ్రవరి 17న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు పార్క్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ పనుల్లో జాప్యం జరిగింది. గత నాలుగు రోజులుగా మళ్లీ పనులు చేపట్టారు. నాలుగు నెలల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాంతం అంతా ఎత్తుపల్లాలు ఉండడంతో చదును చేయడంలో జాప్యం జరిగిందని, ఇక పనులు వేగవంతంగా సాగుతాయని డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్ తెలిపారు.

వాకింగ్ ట్రాక్

ఆరు ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ పార్క్ మధ్యలో నీటికుంటలు ఉంటాయి. భవిష్యత్‌లో ఎస్సార్పీ 1 గని మూతపడితే దానిలో నుంచి వచ్చే ఊట నీటిని ఈ కుంటల్లో నింపుతారు. రాశిఫలాలను బట్టి అన్ని రాశులకు సంబంధించిన వాటితో రాశివనం ఏర్పాటు చేస్తారు. సహజ సిద్ధంగా ఉండే పచ్చదనం, అడవుల్లో సహజంగా పెరిగే వృక్ష జాతులను పెంచుతారు. అడవుల్లో సహజ సిద్ధంగా ఉండే మట్టి దారిలా చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తారు. బటర్‌ఫ్లై, ఇతర పక్షి జాతులు ఆవాసంగా ఉండే రకరకాల మొక్కలు, వనాలు, కొన్ని పండ్ల మొక్కలు పెంచుతారు. ప్రస్తుతం సివిల్ పనులు పూర్తి చేసిన తర్వాత పచ్చదనం పెంపొందిస్తారు.

పిక్నిక్ స్పాట్‌గా...

శ్రీరాంపూర్‌లో కార్మిక కుటుంబాలు ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఆహ్లాదంగా గడపడానికి ఎలాంటి పిక్నిక్ స్పాట్‌లు లేవు. గతంలో సీతారాంపల్లి ఇంటెక్‌వెల్ ఉన్నా పంప్‌హౌజ్‌ల రక్షణలో భాగంగా మూసివేశారు. ఈ ఎకో పార్క్ పిక్నిక్ స్పాట్‌గా కూడా ఉపయోగపడనుంది.

అడవిలో మంటలపై సమాచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీపీటీ శాంతారాం, పాల్గొన్న అధికారులు

- అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానం
- అధికారులకు అవగాహన

జన్నారం: వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగి మంటలు వ్యాపించి వన్యప్రాణులు, పక్షులకు ఇబ్బంది ఏర్పడకుండా ముందస్తు సమాచారం, అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతం వివరాలు అందించేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటవీశాఖ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం జన్నారంలోని టీడీసీలో టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, జిల్లా అటవీ సంరక్షణ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ఆధ్వర్యంలో టైగర్‌జోన్ పరిధిలోని ఎఫ్‌డీవో, రేంజ్ అధికారులకు అగ్ని ప్రమాదాలు అదుపు చేసే విధానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదంపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసే శాటిలైట్ విధానంపై బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్(సీడబ్ల్యూఎస్) నిపుణుడు నరేంద్రన్ కోదండపాణి వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు శాటిలైట్ ద్వారా డివిజన్, రేంజ్, బీట్, కంపార్టుమెంటు నంబరుతో సహా సంబంధిత బీట్ అధికారి, ఉన్నతాధికారులకు మెస్సేజ్ వెళ్తుందని తెలిపారు. దట్టమైన ప్రాంతం, గుట్టలపై అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అక్కడికి చేరుకునేలోగా ఆలస్యం కావడంతో మంటలు ఎటు వైపు వ్యాప్తి చెందుతున్నాయనే విషయాన్నీ తెలియజేసే పద్ధతిని ఇక్కడ అవలంబిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రదేశానికి తగ్గట్టుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా మార్చుకోవాలో వివరించారు. గతంతో పోలిస్తే మూడో వంతు అగ్ని ప్రమాదాలు సాంకేతిక పరిజ్ఞానం వల్ల తగ్గినట్లు పేర్కొన్నారు. ప్రమాదాలను ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీ చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రేంజ్ అధికారులు సుష్మారావు, శ్రీనివాస్, డీఆర్వో తిరుపతి, వివిధ ప్రాంతాల ఎఫ్‌డీవోలు, రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి



పాఠశాలలో విద్యార్థినిని ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- మండలంలో పాఠశాలల తనిఖీ

భీమారం: విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతన్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, శౌచాలయాలు, ప్రహరీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని తెలిపారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కాగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలించారు.

ప్రజావాణి రద్దు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, వచ్చే నెల 3న కౌంటింగ్, 8వ రకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు.

అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 27న అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

- 11రోజులంటూ అధికారుల ప్రకటన
- రైలు ప్రయాణికులకు ఇబ్బందికర పరిస్థితులు



బెల్లంపల్లి రైల్వేస్టేషన్

బెల్లంపల్లి: దక్షిణ మధ్య రైల్వే అధికారుల నిర్ణయంతో రైలు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏ చిన్న సమస్య తలెత్తినా, ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టినా రోజుల తరబడి రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేస్తుండడం ఇటీవలి కాలంలో రైల్వే అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలున్నాయి. తాజాగా మరోసారి రైళ్ల రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా రైళ్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రోజువారీగా రాకపోకలు సాగించే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్(రైలు నంబరు 17233, 17234)ను ఈ నెల 10నుంచి 20వరకు 11రోజులపాటు రద్దు చేస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుతో లింక్ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాగించే రైలు ప్రయాణికులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తనున్నాయి. రైళ్ల పునరుద్ధరణ జరిగే వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

30రైళ్లు..

కాజీపేట జంక్షన్-డోర్నకల్ జంక్షన్, డోర్నకల్ జంక్షన్-విజయవాడ, భద్రాచలం రోడ్-విజయవాడ మధ్య నడిచే దాదాపు 30 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ప్యాసింజర్ రైళ్లను వేర్వేరు తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటిలో డైలీ, వీక్లీ రైళ్లు ఉన్నాయి. రద్దయిన వాటిలో గోల్కొండ, భాగ్యనగర్, శాతవాహనతోపాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. ఆయా మార్గాల్లో నడిచే రైళ్లన్నీ 11రోజులపాటు ప్రయాణికులకు అందుబాటులో ఉండవని అధికారులు పేర్కొన్నారు. కాగా, మరో తొమ్మిది రైళ్లను దారి మళ్లించి నడపనున్నారు. నాలుగు రైళ్లు 60 నుంచి 90 నిమిషాలు ఆలస్యంగా నిర్దేశించిన ప్రాంతాల నుంచి బయల్దేరనున్నట్లు వెల్లడించారు.

ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతం

సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సాధారణ రైల్వేస్టేషన్లలోనూ ఆగుతుంది. పేదలు, మధ్య తరగతి ప్రయాణికుల రైలుగా పేరుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్-కాజీపేట జంక్షన్ మధ్య అతి సాధారణ రైల్వేస్టేషన్లలో ఈ రైలుకు హాల్టింగ్ కల్పించడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు, పెద్దపల్లి, హన్మకొండ జిల్లా పరిధిలోని ప్రజలు, వ్యాపారులు, సింగరేణి కార్మికులు, విద్యార్థులు, హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఈ రైలును రోజుల తరబడి రద్దు చేయడం వల్ల ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సిన వస్తుంది. ఈ నెలలో పెళ్లి ముహూర్తాలు ఉండడంతో దూర ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుతో లింక్ లేకుండా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపించడానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సానుకూల నిర్ణయం తీసుకోవాలి



ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు, వ్యాపార వర్గాలు, విద్యార్థులు, ప్రత్యేకించి పేదలకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ పనులు లేకపోయినా గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుతో ఉన్న లింక్‌ను దృష్టిలో పెట్టుకుని 11 రోజులపాటు రద్దు చేయడం సరికాదు. ఈ విషయంలో రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

– ఎస్.నగేష్, బెల్లంపల్లి

రాకపోకలపై నిషేధం ఎత్తివేయాలని వినతి



పీసీసీఎఫ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లో అడవి గుండా వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేయాలని, రాత్రివేళల్లో అన్ని రకాల వాహనాలు, స్థానికులు, స్థానికేతరులను అనుమతించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పీసీసీఎఫ్ డొబ్రియాల్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. అటవీ అధికారులు అవలంబిస్తున్న తీరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు భయందోళనకు గురి కావద్దని, చెక్‌పోస్టుల వద్ద రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయనున్నారని తెలిపారు. రాత్రిపూట వాహనాల రాకపోకలపై నిషేధం లేకుండా చూస్తామని, స్థానికులు ఆధారాలు చూపించి రాకపోకలు చేసుకోవచ్చని, చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి వేధింపులు ఉండవని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తక్షణమే ఆదేశాలు ఇస్తానని పీసీసీఎఫ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వైద్యులను ఆదేశించారు. చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయేరియాతో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అన్నారు. బట్టిగూడెం, జెండావాడల్లో మిషన్ భగీరథ ద్వారా నీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. జాతరతో నీళ్లు కలుషితం అయ్యాయని, బతుకమ్మ వాగు నుంచి కాకుండా గోదావరి నుంచి నీళ్లు వచ్చేలా చూస్తామని తెలిపారు. కలెక్టర్‌తో కూడా మాట్లాడి నిధులు కేటాయించి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం లక్ష్మీదేవర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన ఓంకార ఆధ్య అనే బాలిక వైద్యానికి రూ.1.50లక్షలు ఎల్‌ఓసీ అందజేశారు. అనంతరం కిష్టంపేటలోని బీఎంఆర్ గార్డెన్స్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ కూతురు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఇటీవల స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో సీవోఈ విద్యార్థులు ఏడుగురు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున పాల్గొని కాంస్య పతకం గెలుచుకున్నారు. శుక్రవారం గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఏ.శ్రీహర్షవర్ధన్, డి.విశ్వతేజ, బి.వర్షిత్, ఎస్.సంకేత్ సాయి, డి.ఆసిత్, బి.రిషేంద్రవర్మ, ఎన్.రుషికేష్‌లను ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.విజయ్‌సాగర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు అల్లూరి వామన్, ఎం.రాజశేఖర్, హౌజ్ మాస్టర్ మల్లికార్జున్, ప్రేమలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామంలోకి మనుబోతు పిల్ల


మనుబోతు పిల్లను అటవీ ప్రాంతంలో వదిలేస్తున్న ఎస్సై భాస్కరాచారి

కుంటాల: కుంటాలకు చెందిన హరీశ్ మేకల మందను తోలుకొని కుంటాల పొలిమేరకు వెళ్లాడు. తిరిగి పశువుల పాక వద్దకు రాగా మందలో మనుబోతు ఉన్నట్లు గుర్తించాడు. యజమాని కక్కెర ముత్యంరావు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై భాస్కరాచారి మనుబోతు పిల్లను దొనెల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలేశారు.

ఒకరి రిమాండ్

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామానికి చెందిన దాసర్‌వాడ్ గణేశ్ తల్లిని రాయితో గాయపర్చినందుకు శుక్రవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. సింగన్‌గాం గ్రామానికి చెందిన దాసరవాడ్ గణేశ్ అయన భార్య భాగ్యశ్రీ మధ్య గురువారం గొడవ జరిగింది. గొడవ ఆపేందుకు తల్లి కోండ్యామబాయి వెళ్లింది. గణేశ్ రాయితో భార్య బాగ్యశ్రీకి కొడుతుండగా అడ్డుకోబోయిన కోండ్యాబాయికి తలకు తగలడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను హైదారాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. కుటుంబ సభ్యులు గురువారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం గణేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్సై రమేశ్ తెలిపారు.

కారును ఢీకొన్న లారీ


లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన గుజ్జుల్‌వార్ శంకర్ కారులో నిర్మల్ నుంచి వస్తూ నిర్మల్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, బాసర నుంచి నిర్మల్‌కు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టి కొద్దిదూరం వరకు రాసుకెళ్లింది. దీంతో కారులోని శంకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు.

మహిళల ఉపాధికి ఊతం

- ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు
- రైతులకు ఆసరాగా నిలిచేందుకు మహిళా సంఘాలకు డ్రోన్లు
- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా అందించేందుకు ప్రతిపాదనలు


పంటలపై రసాయనాలు పిచికారీ చేస్తున్న డ్రోన్

కోటపల్లి: మహిళా సంఘాల్లోని సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రైతులకు ఆసరాగా ఉండేందుకు మహిళా సమాఖ్యలకు రాయితీలపై డ్రోన్లు అందించే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ముందుగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున డీఆర్డీఏ నుంచి ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం నుంచి భీమారం, మంచిర్యాల నియోజకవర్గం నుంచి దండేపల్లి, బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి నెన్నెల మండలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించారు. దీని ద్వారా రైతులకు మేలు చేయడంతో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో పథకాన్ని అమలు చేయనున్నారు.

80 శాతం రాయితీపై..

రసాయన ఎరువులను డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పలు కంపెనీలు కూడా సహకార సంఘాల ద్వారా డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా రూ.10 లక్షల డ్రోన్ యంత్రానికి రూ.8 లక్షలు రాయితీ వర్తిస్తుండగా మిగతా రూ.2 లక్షలు మండల మహిళా సమాఖ్యలు భరించాల్సి ఉంటుంది. డ్రోన్లు మండల మహిళా సమాఖ్యలకు అందిన తర్వాత వాటి నిర్వహణకు ఇద్దరిని నియమించనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చి పంట పొలాల్లో రసాయనాలు పిచికారీ చేయనున్నారు. డ్రోన్లతో వరి, పత్తి, మామిడి తోటలకు రసాయనాలు పిచికారీ చేసుకునే అవకాశం ఉండగా కూలీల కొరత అధిగమించవచ్చు. ఇది విజయవంతమైతే మండలాల వారీగా విస్తరించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పర్యవేక్షణ పెరిగితేనే సత్ఫలితాలు..

ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పరికరాలపై అధికారుల పర్యవేక్షణ పెరిగినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చు. గతంలో మహిళా సంఘాల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు అందుబాటులో ఉండేందుకు ట్రాక్టర్లు, పనిముట్లు కొనుగోలు చేసి అందించారు. జిల్లాలోని అన్ని మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేయగా నిరుపయోగంగా మారాయి. కొన్ని మండలాల్లో కొనుగోలు చేసి రెండు, మూడేళ్లు గడిచినా వినియోగించకుండా సెర్ప్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని సంఘాలు అద్దెకు ఇవ్వగా వచ్చిన డబ్బుల కంటే నిర్వహణ భారం ఎక్కువ కావడంతో పక్కన పడేశారు. కాగా రుణ బకాయిలు సంఘాలకు భారంగా మారాయి.

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	గ్రామాఖ్య సంఘాలు	స్వయం సహాయక సంఘాలు	సభ్యులు
ఆదిలాబాద్	557	10920	119664
కుమురంభీం	398	8138	92512
మంచిర్యాల	468	10198	115018
నిర్మల్	504	12040	138410

ఉపాధి లభిస్తుంది..

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు రాయితీలపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. దీనిద్వారా రైతులకు అందుబాటులో పిచికారీ యంత్రాలు ఉండటమే కాకుండా మహిళలకు ఉపాధి లభించనుంది. మహిళా సభ్యులకు బాధ్యతలు అప్పగించి పర్యవేక్షణ పెంచుతాం.

– సంజీవ్, డీపీఎం, మంచిర్యాల

బాసరకు పోటెత్తిన భక్తులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు

బాసర: మాఘ మాసం దశమి, రోహిణి నక్షత్రంతోపాటు శుక్రవారం శుభదినం కావడంతో నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి దేవి దర్శనానికి భక్తుల భారీగా తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. వేకువ జామున అమ్మవారికి అర్చకులు అభిషేకం, అర్చన, విశేష పూజలను నిర్వహించారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు.. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. పూజల అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షర శ్రీకర పూజలు, కుంకుమ పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రూ.12.27 లక్షల ఆదాయం..

బాసర ఆలయానికి శుక్రవారం రూ.12,27, 275 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. రూ.1000 అక్షరాభ్యాసాలు 687 జరుగగా రూ.6,87,000లు, రూ.1550 అక్షరాభ్యాసాలు 300 జరుగగా, రూ.45,000, రూ.100 మండప ప్రవేశం 1,200 నిర్వహించగా, రూ.1,20,000లు, రూ.50 మండల ప్రవేశాలు 108 నిర్వహించగా రూ.5,400, రూ.100 అభిషేకం లడ్డూ ప్రసాదం 1,823 విక్రయించగా, రూ.1,82,300, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,87,575 ఆదాయం వచ్చినట్లు వివరించారు.


అక్షర శ్రీకార పూజల్లో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారులు

బెల్లంపల్లిలో రెచ్చిపోయిన దొంగలు

- పట్టపగలే రూ.4.40లక్షలు చోరీ
- బైక్‌పై ఉడాయించిన యువకులు


బాధితుడు దుర్గం వెంకటస్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో దొంగలు శుక్రవారం పట్టపగలే రెచ్చిపోయారు. మార్కెట్‌లో మోటార్ సైకిల్ పార్కింగ్ చేసి పక్కన కూరగాయలు కొనుగోలు చేస్తుండగా.. రెప్పపాటు వ్యవధిలో దొంగలు డబ్బుల కవర్‌ను తస్కరించి పారిపోయారు. బాధితుడు దుర్గం వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి మేనకోడలు వివాహం మార్చి 2న ఉంది. అవసరాల నిమిత్తం రూ.4.40లక్షలు స్థానిక ఎస్‌బీఐ బజార్ ఏరియా బ్రాంచిలో ఉదయం 11.30గంటలకు డ్రా చేశాడు. నగదును ఓ కవర్‌లో ఉంచి మోటార్‌సైకిల్ పెట్రోల్ ట్యాంకుపై ఉన్న కవర్‌లో భద్రపర్చాడు. కూరగాయలు తీసుకు రావాలని ఇంటి నుంచి ఫోన్ రావడంతో స్థానిక మార్కెట్ మెట్ల వద్ద పార్కింగ్ చేశాడు. మోటార్‌సైకిల్‌ను గమనిస్తూనే కూరగాయలు కొనుగోలు చేస్తున్నాడు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్ వద్దకు వచ్చి నగదు ఉన్న కవర్‌ను దొంగిలించారు. ఓ యువకుడు బ్యాగ్ పట్టుకుని అప్పటికే అక్కడ మోటార్‌సైకిల్‌పై సిద్ధంగా ఉన్న మరో యువకుడితో పారిపోయాడు. వెంకటస్వామి గమనించి కొంతదూరం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. ఇద్దరు యువకులు తలకు టోపీ ధరించి ముఖం కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నిమిషాల వ్యవధిలో జరిగిన ఈ చోరీ పుర ప్రజలను కలవరపాటుకు గురి చేసింది. బాధితుడు వెంకటస్వామి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.



బ్యాగ్‌తో బైక్‌పై వెళ్తున్న అనుమానిత యువకుల సీసీ ఫుటేజీ

సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు

బ్యాంకులోని సీసీ ఫుటేజీని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య పరిశీలించారు. వెంకటస్వామి ఏ సమయానికి బ్యాంకుకు వచ్చాడు, ఎవరైనా అతడిని అనుసరించారా అని పరిశీలించారు. దొంగలు ఎలా ఉంటారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ ఫుటేజీలోని ఓ యువకుడిపై అనుమానం వచ్చినట్లు సమాచారం. కాంటా చౌరస్తాలో బైక్‌పై ఇద్దరు యువకులు వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు వద్ద మాటు వేసి వెంకటస్వామిని అనుసరించి దొంగిలించినట్లుగా తెలుస్తోంది.

దేవతామూర్తుల కోసం ఆందోళన

- వదంతులతో ఇరు గ్రామల మధ్య గొడవ
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


ఎలగడప గ్రామంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలోని పురాతన అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను సంప్రదాయం ప్రకారం మండలంలో ఎలగడప గ్రామం నుంచి ఊరేగింపుగా అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తీసుకొస్తారు. తెల్లవారితే ఊరేగించే ఉత్సవ మూర్తులు శుక్రవారం కనిపించలేదు. దీంతో సారంగాపూర్ గ్రామస్తులు ఎత్తుకెళ్లారని శుక్రవారం రాత్రి పుకార్లు వ్యాపించడంతో ఎలగడప గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడికి చేరుకున్నా ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించారు. ఉత్సవ మూర్తులను ఆలయ పూజారులే తీసుకెళ్లారని గ్రామస్తులకు తెలుపడంతో ఆందోళన సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుడిహత్నూర్: మండలంలోని నేషనల్ హైవే 44పై సీతాగొంది సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని న్యూకుమ్మరివాడకు చెందిన జిల్లెడ దత్తు (25), నరేశ్ ఇద్దరూ టూ వీలర్‌పై గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా అదే వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ నరేశ్‌ను స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసగించిన వ్యక్తిపై కేసు

కైలాస్‌నగర్: ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2లక్షలు వసూలు చేసి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన పీ కృష్ణాచారికి డీఆర్డీవోలో ఉద్యోగమిప్పిస్తానని ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరివాడకు చెందిన పోతిపెల్లి ప్రశాంత్ రెండేళ్ల క్రితం రూ.2లక్షలు డిమాండ్ చేసి రూ.లక్ష తీసుకున్నాడు. ఆ తర్వాత ఉద్యోగమిప్పించకపోవడంతో డబ్బులైనా తిరిగివ్వాలని కృష్ణాచారి కోరగా ఇవ్వనని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

దండేపల్లి: దాడి కేసులో మండలంలోని కుంటలగూడ(కట్ట)కు చెందిన ముడితే లింగయ్యకు జైలు శిక్ష విధిస్తూ లక్సెట్టిపేట కోర్టు జడ్జి అసదుల్లా షరీఫ్ శుక్రవారం తీర్పునిచ్చారు. కుంటలగూడ(కట్ట)కు చెందిన ఏదుల రమేష్‌తో ముడితే లింగయ్య 2018అక్టోబర్ 10న గొడవపడి కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ పూర్తి కావడంతో నిందితుడు లింగయ్యకు 59రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మిగిలింది.. సోమవారమే

- ఒక్కరోజే భారీగా నామినేషన్లు
- గ్రాడ్యుయేట్స్‌కి 28, టీచర్స్‌కు 2, మొత్తం 30
- ర్యాలీగా నామినేషన్లు వేసిన నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి
- స్వతంత్రులుగా రవీందర్‌సింగ్, హరికృష్ణ నామపత్రాలు
- నేడు, రేపు సెలవు దినాలు మిగిలింది ఒక్కరోజే


నామినేషన్ వేస్తున్న నరేందర్‌రెడ్డి


నామినేషన్ వేస్తున్న అంజిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్–మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు పోటెత్తాయి. శుక్రవారం మంచిరోజు కావడంతో ఆయాస్థానాలకు పోటీ చేస్తున్న ఆశావహులు అనుచరగణంతో భారీర్యాలీగా వచ్చి నామినేషన్లు వేశారు. గ్రాడ్యుయేట్స్ స్థానానికి 28మంది, టీచర్స్ స్థానానికి రెండు మొత్తం 30 నామపత్రాలు వేశారు. ఈనెల 3వ తేదీన నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ.. శుక్రవారం దాఖలైన నామపత్రాలు అత్యధికం కావడం గమనార్హం. ఉదయం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ప్రసన్న హరికృష్ణ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరిలో రవీందర్‌సింగ్ సన్నిహితులతో రాగా, హరికృష్ణ అనుచరులు, కళాకారులతో భారీ ర్యాలీగా వచ్చారు. వీరితోపాటు సామాజిక ఉద్యమకారులు బక్క జడ్సన్, సిలివేరు శ్రీకాంత్, మాజీ డీఎస్పీ మదనం గంగాధర్, లక్ష్య స్కూల్స్ అధినేత ముస్తాక్‌అలీ నామినేషన్ పత్రాలను కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు.

నేడు, రేపు సెలవు

శనివారం, ఆదివారం సెలవుదినం కావడంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉండదు. ఇక మిగిలింది 10వ తేదీ మాత్రమే. సోమవారం చివరి రోజు కూడా భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశముంది. ఇంతవరకూ వేయని వారితోపాటు రెండోసారి వేసేవారికి అదే చివరి అవకాశం. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మెదక్ జిల్లా మంత్రి దామోదర రాజనరసింహలతో కలిసి భారీ ఊరేగింపుగా వచ్చి మరోసారి నామినేషన్ దాఖలు చేయనున్నారు. రవీందర్ సింగ్ కూడా రెండోసెట్ దాఖలుకు ర్యాలీ తీయనున్నారు. న్యాయవాది మెతుకు హేమలత పటేల్ గ్రాడ్యుయేట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్లలో హేమలత ఏకైక మహిళ కావడం విశేషం.

విజయాన్ని సోనియాకు అందజేస్తాం: నరేందర్‌రెడ్డి

తనపై నమ్మకంతో తనకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి, సోనియాగాంధీకి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గెలిచి కానుకగా అందజేస్తానని నరేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నిరుద్యోగుల సమస్యలు తీర్చిందన్నారు. మేనిఫెస్టోతో పట్టభద్రులను చేరుకుంటామని, 10న మంత్రులు, అగ్రనేతలతో రెండోసెట్ దాఖలు చేస్తామని తెలిపారు.

ఓటుతో బుద్ధి చెప్పండి: అంజిరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్నివర్గాల హామీలు నెరవేర్చడంలో విఫలమైందని అంజిరెడ్డి అన్నారు. అందుకే, ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరు మరీ అధ్వానంగా ఉందన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా కోరారు.

ప్రశ్నించే గొంతుకనవుతా: ప్రసన్న హరికృష్ణ

తన 19 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత పక్షాన ప్రశ్నించే గొంతుకనై వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతానని ప్రసన్న హరికృష్ణ అన్నారు. మీ వాడిగా, మీ గొంతుకగా, మీ సమస్యల పరిష్కరానికి నిత్యం పోరాటం చేయడానికే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేసిన తనను గెలిపించాలని కోరారు.

కబడ్డీ చాంపియన్ సూర్యాపేట


చాంపియన్ షిప్ అందుకుంటున్న సూర్యపేట జట్టు


ట్రోఫీ అందుకుంటున్న రెండవ స్థానంలో నిలిచిన నల్గొండ జట్టు

- రెండో స్థానంలో నల్గొండ జట్టు
- హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్

ఆదిలాబాద్: 71వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యపేట జట్టు విజేతగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 4న కబడ్డీ పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం ముగిసాయి. రాష్ట్ర కబడ్డీ అసోసియేసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో రాష్ట్రంలోని 34 జిల్లాలకు చెందిన 500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సింథటిక్ మ్యాట్లపై నాలుగు రోజుల పాటు డే నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సూర్యపేట జట్టు నల్గొండ జట్టుపై 39–33 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. గత ఏడాది సైతం ఈ టోర్నీలో ఈ రెండు జట్లే తలపడగా.. నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. ఈసారి చరిత్రను తిరగరాస్తూ సూర్యపేట చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. నల్గొండ రెండో స్థానంలో నిలువగా.. వనపర్తి, రంగారెడ్డి జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

త్వరలో తెలుగు కబడ్డీ లీగ్

త్వరలో తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తెలుగు కబడ్డీ లీగ్ ప్రారంభించనున్నట్లు ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మార్చిలో 15రోజులు హైదరాబాద్‌లో, మరో 15రోజులు విజయవాడ వేదికగా మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. ఒక్కో క్రీడాకారుడికి రూ.15లక్షలు చెల్లించి టోర్నీలో ఆడే అవకాశం కల్పిస్తామని వివరించారు. ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కబడ్డీ ఉమెన్ అకాడమీ ఏర్పాటుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రానికి వినతిపత్రం అందించారని తెలిపారు. ఇక్కడ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వచ్చే జూన్ నుంచి హైదరాబాద్‌లో కబడ్డీ అకాడమీ ప్రారంభిస్తామని తెలిపారు. ఇందులో 40 మంది క్రీడాకారులకు ఉచిత శిక్షణ అందిస్తామని, ఈ సదావకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంపులు నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కబడ్డీ టీం మాజీ కోచ్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రవికుమార్, రాష్ట్ర సంఘం జాయింట్ సెక్రెటరీ గట్టయ్యయాదవ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి, ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు సతీష్‌కుమార్, రెఫరీ బోర్డ్ చైర్మన్ అనిల్‌కుమార్, హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, రాష్ట్ర సెలక్షన్ కమిటీ మెంబర్ విఠల్‌యాదవ్ పాల్గొన్నారు.